# కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలి



దుబ్బాకలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



దుబ్బాకలో బీడీలు చుట్టి ఓట్లు అభ్యర్థిస్తున్న చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు

### దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి

దుబ్బాక టౌన్, నవంబర్ 3: దుబ్బాక నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని 1వ వార్డులో డబుల్ బెడ్రూం కాలనీతోపాటు పలు వార్డుల్లో చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న చైర్‌పర్సన్ వనిత మాట్లాడుతూ.. మూడేండ్లుగా దుబ్బాక అభివృద్ధిలో వెనకబడిందన్నారు. మరోసారి ప్రతిపక్షాల మోసపూరిత మాటలకు మోసపోయి నియోజకవర్గ అభివృద్ధిని కాలరాసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నిమ్మ రజిత, దేవుని లలిత, పులిగారి కల్పనాఎల్లం, పల్లె మీనారామస్వామిగౌడ్, బట్టు యాదమ్మ ఎల్లం, ఆస సులోచన స్వామి, నాయకులు గోనె మధు, అంకం దుబ్బయ్య, పండు, శ్రీరాం సంగీత పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే

- మైనార్టీలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారు
- బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతల సమస్య
- ఎంఐఎం పోటీ చేయని చోట బీఆర్ఎస్‌కు ఓటేయాలి
- సంగారెడ్డి సభలో ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ



సంగారెడ్డి సభలో మాట్లాడుతున్న ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ

సంగారెడ్డి అర్బన్, నవంబర్ 3: పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని.. కాంగ్రెస్,బీజేపీ ఈ రెండు పార్టీలు ఒక్కటే అని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. సంగారెడ్డి పట్టణంలో గురువారం రాత్రి నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ కన్నుసన్నుల్లో పనిచేస్తున్నట్లు ఆరోపించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మైనార్టీలకు అన్నిరంగాల్లో సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని పేర్కొన్నారు. మజ్లిస్ పోటీచేయని చోట బీఆర్ఎస్‌కు ఓటే వేయాలని పిలుపునిచ్చారు.ఎంఐఎం అమ్ముడు పోతుందని రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి చాలా మంది నేతలు బీజేపీలో చేరారని, వాళ్లు ఎంతకు అమ్ముడుపోయారని అసదుద్దీన్ ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని డబ్బులు తీసుకుని ఓడిపోయిందో చెప్పాలని ప్రశ్నించారు. జాతీయ పార్టీలు అధికారంలో ఉన్నచోట శాంతిభద్రతల సమస్యలు వస్తున్నాయని, మైనార్టీల భద్రతను కాలరాస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వం అన్నివర్గాలను సమానంగా చూస్తున్నదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని, బీఆర్ఎస్ పాలన బాగుందని అసదుద్దీన్ ప్రశంసించారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

మిరుదొడ్డి, నవంబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు వడ్లను విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ మిరుదొడ్డి ఏపీఎం నాయిని కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ధర్మారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం నాయిని కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. క్వింటాల్ ఏ గ్రేడ్ వడ్లకు రూ.2,203, క్వింటాల్ బీగ్రేడ్ వడ్లకు రూ.2,183 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్నిరకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ ప్రభాకర్, ఏఈవో నిర్మల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండానే..



కమ్మర్‌పల్లిలో ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని మహిళలను కోరుతున్న తిమ్మాపూర్ ఎంపీటీసీ మాధవి, బీఆర్ఎస్ శ్రేణులు

దుబ్బాక, నవంబర్ 3: దుబ్బాక గడ్డపై ఎగిరేది గులాబీ జెండానేనని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని బీఆర్ఎస్ దుబ్బాక మండల ఎన్నికల పరిశీలకుడు ఎల్లు రవీందర్‌రెడ్డి, దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక మండలం చీకోడు, కమ్మర్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే అని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. గత ఉప ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి మోసపోయామని, మళ్లీ ఆ గోస పడొద్దని సూచించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఆయనపై జరిగిన కత్తిదాడి బాధాకరమని, అలాంటి హింసాయుత రాజకీయ శక్తులను దుబ్బాక నుంచి తరమికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మాధవి, రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్, అంజిరెడ్డి, నారాగౌడ్, రాజయ్య, శ్రీనివాస్, సద్ది రాజిరెడ్డి, నరేశ్ నర్సింలు, పరశురాములు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎంపీపీ



సీఎం కేసీఆర్‌తో ఎంపీపీ అమరావతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్

గజ్వేల్, నవంబర్ 3: ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా శుక్రవారం గజ్వేల్ ఎంపీపీ దాసరి అమరావతి, గజ్వేల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ దుంబాల అరుణాభూపాల్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వారిని ఆప్యాయంగా పలకరించారు.

## సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా



చెప్యాలలో బీడీ కార్మికులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు


మిరుదొడ్డి, నవంబర్ 3: ప్రజలు ఇచ్చే తీర్పుతో సీఎం కేసీఆర్ మూడోసారి సీఎంగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఎంపీపీ గజ్జల సాయిలు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం చెప్యాల, మల్లుమల్లి గ్రామాల్లో సర్పంచ్ సిద్ధి భారతి భూపతిగౌడ్‌తో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ ప్రజలు కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలుపునకు శ్రీరామరక్షగా నిలుస్తాయని తెలిపారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కారు గుర్తుకు ఓటేసి ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ.అహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు సత్యనారాయణ, నంట బాపురెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సల్లూరి మల్లేశం, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు సూకురి లింగం, సిద్ధి భూపతిగౌడ్, గొట్టం బైరయ్య, నాయకులు మల్లారెడ్డి, శివసత్యం, రాజిరెడ్డి, అరుణ్, నర్సింహారెడ్డి, శంకర్, రాంరెడ్డి, రాకేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక రోడ్లపై రయ్‌రయ్

- రూ.25 కోట్లతో అభివృద్ధి
- పలు గ్రామాల ప్రజలకు తగ్గిన దూరభారం
- సంతోషం వ్యక్తంచేస్తున్న వాహనదారులు, ప్రయాణికులు




దుంపలపల్లి - ధర్మారం మధ్య కంకర తేలిన రోడ్డు




దుంపలపల్లి-ధర్మారం మధ్య నూతనంగా వేసిన బీటీ రోడ్డు

దుబ్బాక టౌన్, నవంబర్ 3: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో దుబ్బాక మున్సిపల్ పరిధిలోని వార్డులకు అనుసంధానమయ్యే రోడ్లన్నీ అభివృద్ధి చెందాయి. దుబ్బాక పట్టణంలోని అంతర్గత రోడ్లతోపాటు దుబ్బాక–దుంపలపల్లి, దుబ్బాక–ధర్మాజీపేట, లచ్చపేట, చెల్లాపూర్ వార్డులోని రోడ్లు అందంగా మారాయి. పట్టణంలో బైపాస్ రోడ్డు సౌకర్యంగా మారింది. రోడ్ల అభివృద్ధిపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి – మిరుదొడ్డి మండలం ధర్మారం(మెదక్ పీడబ్ల్యూడీ) మధ్య రోడ్డుకు మోక్షం లభించింది. అందమైన బీటీ రోడ్డు ఏర్పాటైంది. గత ప్రభుత్వాల హయాంలో పట్టించుకోకపోవడంతో ఈ రోడ్లపై ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. మెదక్ పీడబ్ల్యూడీ ప్రధాన రహదారి నుంచి దుంపలపల్లి మీదుగా బల్వంతాపూర్ గ్రామాలకు అనుసంధానమయ్యే 7.10 కిలో మీటర్ల రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.4.02 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయగా నేడు అందమైన బీటీ రోడ్డు ఏర్పాటు కావడంతో ఏండ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలిగిపోయాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరై పనులు పూర్తికావడంతో దుంపలపల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. అధ్వానంగా మారిన దుంపలపల్లి – ధర్మారం గ్రామాల మధ్య రోడ్డుతో 18 ఏండ్లుగా నరకయాతన అనుభవించిన వాహనదారులకు తెలంగాణ ప్రభుత్వంలో ఊరట లభించింది. రోడ్డు బాగు చేయడంతో దుబ్బాక మండలంలోని మారుమూల గ్రామాల నుంచి హైదరాబాద్‌తోపాటు సిద్దిపేట, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా మారడంతో యా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.